# గురువాణి

డిజిటల్ ఉచిత తెలుగు ఆధ్యాత్మిక మాస పత్రిక

సంపుటి 4 | సంచిక 03

మార్చి - 2025

మార్చి 30 - ఉగాది

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం

క్రోధి ఫాల్గుణము - విశ్వావసు చైత్రము



శ్రీ వనదుర్గా

ప్రవచనం

"మోక్ష మార్గం: బంధనాల నుండి విముక్తి సాధన"

ప్రత్యేక వ్యాసం

గోమాత

రచన: శ్రీమతి జయశ్రీ పసల

శ్రీ విద్యా సాధన

"సాధన నుండి మూలానికి" (భాగం 1)

రచన: డా. గౌతం రాజు

శ్రీవిద్యా మందిరములు

సుందర మహాలక్ష్మీ దేవాలయం, తమిళనాడు.

సాధకుల అనుభవాలు

"ఆధ్యాత్మిక బోధనలో గురువు అనుగ్రహం"

శ్రీమతి ఆన్ని

బాలల విభాగము

కృష్ణుడు మరియు అబద్ధ భక్తుడి లీలా కథ

సంకలనం: శ్రీమతి ఇంద్రాణి యశోద కొంపెల్ల



# శ్రీ లలితా దేవి ధ్యాన శ్లోకం

ధ్యాయేత్ పద్మాసనస్థాం వికసితవదనాం పద్మ పత్రాయతాక్షీం
హేమాభాం పీతవస్త్రాం కరకలిత లసమద్ధేమపద్మాం వరాంగీమ్ ।
సర్వాలంకారయుక్తాం సకలమభయదాం భక్తనమ్రాం భవానీం
శ్రీ విద్యాం శాంతమూర్తిం సకల సురసుతాం సర్వసంపత్-ప్రదాత్రీమ్

ఈ శ్లోకం శ్రీవిద్యా, భవానీ దేవిని వర్ణిస్తుంది. ఆమె పద్మాసనంలో కూర్చొని, కాంతివంతమైన రూపంతో భక్తులను అనుగ్రహించే శాంత స్వరూపిణి. ఆమె అభరణాలతో అలంకరించబడి, భక్తులకు భయహరణిగా నిలుస్తుంది. ఆమె సకల దేవతల మూలస్వరూపం, భక్తులకు సకల సంపదలు ప్రసాదించేది.

ఈ శ్లోకాన్ని పఠించడం ద్వారా శాంతి, ఐశ్వర్యం, భక్తి, గ్నానం లభిస్తాయని విశ్వాసం



**శ్రీ గురుభ్యో నమః | శ్రీ మాత్రే నమః ||**

# విషయ సూచిక


**గురువాణి**

**డిజిటల్ ఉచిత తెలుగు ఆధ్యాత్మిక మాస పత్రిక**

సంపుటి 4 | సంచిక 03 | మార్చి - 2025

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం

క్రోధి ఫాల్గుణము - విశ్వావసు చైత్రము

**గురువాణి**

**డిజిటల్ ఉచిత తెలుగు ఆధ్యాత్మిక మాస పత్రిక**

శ్రీవిద్యా జ్ఞానపీఠం (Srividya Learning Centre)

వారిచే తయారుచేయబడినది.


ఈ పత్రికలోని చిత్రములు అంతర్జాలము (Internet) నుండి డౌన్ లోడ్ చేయబడినవి.

**గురువాణి**

**డిజిటల్ ఉచిత తెలుగు ఆధ్యాత్మిక మాస పత్రిక**

అందరికీ షేర్ చేయడం,
యూట్యూబ్ ఛానల్ మరియు ఫేస్ బుక్
పేజిలలో చేరడం ద్వారా పీఠం యొక్క
కార్యక్రమాలలో మీరు భాగస్వాములు కావచ్చును.


©



**శ్రీవిద్య లెర్నింగ్ సెంటర్**

(సౌందర్య లహరి యొక్క ఒక విభాగము)

#27&28 Chairman Rajamanikyam Street,
Karthinagar, Near new railway station,
KANCHIPURAM 2, Tamil Nadu - 631502, India.

srimeru999@gmail.com

+91 8088256632
+91 8608747873

www.srimeru.org

Follow on | Subscribe

Subscribe Newsletter


## ఈ సంచికలో...


| | |
|---|---|
| కవర్ పేజీ చిత్రము<br>చైత్ర మాసం | 01 |
| ధ్యానం<br>శ్రీ లలితా దేవి ధ్యాన శ్లోకం | 02 |
| ప్రవచనం<br>"మోక్ష మార్గం: బంధనాల నుండి విముక్తి సాధన" | 04 |
| ప్రత్యేకం<br>ఉగాది వైభవం | 08 |
| ప్రత్యేక వ్యాసం<br>గోమాత<br>రచన: శ్రీమతి జయశ్రీ పసల | 13 |
| ఖడ్గమాల<br>20వ భాగం - (నిత్యా దేవతలు) | 17 |
| శ్రీ విద్యా జ్ఞానపీఠము సమాచారం | 22 |
| శ్రీ విద్యా సాధన<br>"సాధన నుండి మూలానికి" (భాగం 1)<br>రచన: డా. గౌతం రాజు | 25 |
| శ్రీవిద్యా మందిరములు<br>సుందర మహాలక్ష్మీ దేవాలయం,<br>తమిళనాడు. | 29 |
| సాధకుల అనుభవాలు<br>శోధన నుండి ఉనికి వరకు:<br>గురుజీ కరుణామయ మార్గదర్శకత్వంలో<br>శ్రీవిద్యను స్వీకరించడం - శ్రీమతి ఆన్నీ | 33 |
| బాలల విభాగము - కృష్ణుడు మరియు<br>అబద్ధ భక్తుడి లీలా కథ<br>సంకలనం: శ్రీమతి ఇంద్రాణి యశోద కొంపెల్ల | 35 |
| పీఠంలో జరిగే నిత్య పూజా కార్యక్రమాలు | 38 |
| శ్రీవిద్య సాధనా తరగతులు | 39 |
| నెలలో వచ్చే పండుగలు | 40 |
| చిత్ర మాలిక | 41 |
| చివరి పేజీ చిత్రము<br>ఆణిముత్యాలు | 46 |

# "మోక్ష మార్గం: బంధనాల నుండి విముక్తి సాధన"



మనం చాలా సార్లు, "ముక్తి చెందడం, విముక్తి చెందడం, ప్రాపంచిక విషయాల నుండి దరి చేరడం" ఇలాంటి మాటలు వింటూ ఉంటాం. అయితే, "ముక్తి అంటే దాని కోసం చాలాగొప్ప ప్రయత్నం చెయ్యాలి, కొద్ది మందికి మాత్రమే అది లభిస్తుంది" అన్న నిరాశావాదం చాలా మందికి ఉండి ప్రయత్నమే చెయ్యకుండా వదిలేసిన సందర్భాలు కూడా చాలా ఉంటాయి. అసలు విషయం గమనిస్తే ఆశ్చర్యం వేస్తుంది.

మనం పుట్టినపుడు, అమ్మ గర్భంలో తొమ్మిది నెలలు బందీ గా ఉన్నా అమ్మ దయ వలన, భూమి మీద పడగానే విముక్తి చెందే పడ్డాము. పిండం లో వున్నప్పుడు నేను అన్న బుద్ధికి ఆస్కారమే లేదు. కనుక, తొమ్మిది నెలల బందీ నుండి విముక్తి చెందాము. కానీ భూమి మీద పడగానే మనల్ని మనమే బందీలుగా చేస్కుంటున్నాం అనే విషయం చాలా మందికి తెలియదు.

వయసు పెరిగేకొద్దీ మనం చదువు గురించిన ప్రణాళికలలో బందీ అయిపోతాం.

ఉద్యోగం కోసం ప్రయత్నాలలో బందీ.

వృత్తి గురించి బందీ.

సంసారం లో డబ్బు సంపాదన లో బందీ.

పిల్లల మీద , కుటుంబం లో వ్యక్తుల మీద మితిమీరిన ప్రేమలో బందీ.

ప్రేమ తప్పు అని  ఎవరూ చెప్పరు. మితిమీరిన ప్రేమను మోహం అంటారు. ఆ ప్రేమకు కొంత పరిధి లేదా గిరి గీసుకోవాలి. చాలా మంది "నా బాధ్యత, నా బాధ్యత" అని విపరీత పోకడలకు పోయి ఆ భాద్యత మిషతో ప్రేమని మోహం గా మార్చుకొని ఇంక "జీవితం అంతా పిల్లలే" అన్నట్టుగా చేసుకొని చివరికి ప్రాణం వదిలేటప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే వారి  జీవితం లో వాళ్ళు వుండరు . వాళ్ళకి  చోటే ఉండదు.అలా చేసుకొని నిష్ప్రయోజనంగా వెళ్ళిపోతారు.

స్వామి సత్యానంద సరస్వతి కుండలిని యోగ లో "నీ చుట్టూరా ఒక గిరి గీసుకో .ఆ గిరి దాటి ఎవ్వరూ రావడానికి లేదు . తల్లి, తండ్రి, భర్త, భార్య, పిల్లలు ఎవరూ కూడా" అని చెప్పారు .

మొట్ట మొదట నువ్వు జీవి . నీకంటూ ఊపిరి పీల్చుకోడానికి ఒక కిటికీ ఉండాలి . ఆ వలయం ఎంత విశాలంగా ఎంత దూరంగా ఉంటే మనకి అంత మనశాంతి .ఈ వలయం నేర్పరితనంతో యోగమార్గంతో గీసుకోవాలి

అందుచేత సంసారం లో బందీ అవడం కూడా మనమే చేసుకుంటున్నాము. అమ్మ అమాయకురాలు. అలా సృష్టి చేసి వదిలేసింది. తరువాత, నిరంతరం భవిష్యత్ గురించి ఆలోచించడం వల్లనే భవిష్యత్ ఏర్పడింది అని చెప్పబడుతోంది. ఎప్పుడయినా "ప్రస్తుతం లో ఉన్నామా?" అని మనలను మనం ప్రశ్నించుకోవాలి.

ఈ సమాచారం చదువుతూ కూడా, "పొయ్యి మీద కుక్కర్ పెట్టాను ఏమైపోతోందో! "

ఆ తర్వాత "ఆఫీస్ కి వెళ్ళాలి ఏమైపోతుందో!"

ఆఫీస్ కి వెళ్లి "ఇంట్లో ఏమైపోతుందో!"

ఇలా ఆలోచిస్తూనే ఉంటాము కదా!

ఈ మనసు, ఉన్న చోట ఉండకుండా లేనిచోట సంచరిస్తూ ఉంటుంది. భవిష్యత్ లో చరించాలనే ఎరుక వల్లే భవిష్యత్ ఏర్పడుతుంది. ఎంత సున్నితంగా ఉంటుంది అంటే, ఉన్నది వర్తమానమే అని గ్రహించే సరికి, అది భూతం కింద మారిపోయి, మళ్ళీ వర్తమానం వస్తుంది.

అర్జునుడు కంటి పాప నుండి దృష్టి మరల్చుకోకుండా చెట్టు మీద ఉన్న చిలక మీదనే మనసు నిలిపాడు. అలాగే వర్తమానం మీద దృష్టి ఉంచిన వాడికి భూతం బాధించదు. భవిష్యత్ భయపెట్టదు. వర్తమానమే సుఖమిస్తుంది.

శివుడు మూడో కన్ను తెరిచి మన్మధుడుని దహనం చేశాడు అంటారు. మన్మధుడు ఎవరు? మనసుని మధించే వాడు. మనసుకు సంధానమై ఉన్నవి ఇంద్రియాలు. శివుని మూడు కళ్లు కాలానికి సంకేతాలు. కుడి కన్ను భూత కాలం, ఎడమ కన్ను భవిష్యత్ కాలం.మూడవ కన్ను వర్తమాన కాలం. కుడి కన్ను అనగా భూతకాలం ఎల్లప్పుడూ బాధిస్తూనే ఉంటుంది. ఎడమ కన్నేమో భవిష్యత్తు. అది మాయ, అదే శక్తి . అది ఎప్పుడు ఎలా ఉంటుందో ఏమిటో అని భయపెడ్తూనే ఉంటుంది.. మధ్యలో ఉన్న మూడో కన్నే వర్తమానం. ఎప్పుడయితే మూడో కన్ను అయిన వర్తమానం తెరిచి వర్తమానం లో ఉండటానికి జీవుడు ప్రవర్తిస్తాడో, అప్పుడు ఆ జీవుడు శివుడిగా మారతాడు. శివుడు అంటే ద్రష్ట. నేను అన్న భావం లేనివాడు.

అయితే, వర్తమానంలో ఉండటం అంటే, ఏ కర్మలు చేయకుండా ఉండమని కాదు. ఏ కర్మ లు చెయ్యకుండా ఉండలేరు. ఒక పది నిముషాలు ఏమి చెయ్యకుండా కూర్చోమంటే , కూర్చుంటాము కానీ, ఆలోచిస్తూ ఉంటాము. అనగా ఒక కర్మ చేస్తూనే ఉంటాము. అందుచేత ఏమీ చెయ్యకుండా ఉండలేరు. కనుక, అన్ని కర్మలు చేయాలి. కానీ "నా చేత చేయించ బడుతోంది" అన్న తాదాత్మ్య భావం తో చేయాలి. అమ్మ వద్ద సర్వస్వ శరణాగతి పొంది ఈ తాదాత్మ్య భావంతో కర్మలు చేసినపుడు "నేను" అన్న భావం పోతుంది. "మనలను 'నేను' అనే రూపంలో బాధ పెట్టే మన్మధుడు దహించబడతాడు" అని ఇక్కడ అర్థం చేసుకోవాలి.

వర్తమానం లో ఉన్న వాడికి సంసారం లో ఉన్న ఈ "బందీ" అంటే, "తనని తనను కట్టేసుకోడం" అన్నది ఉండదు. ఇలాగ మనల్ని మనమే బందీలుగా చేసుకుంటాము కనుకనే, అమ్మవారు "విశ్రుంఖలా వివిక్తస్తా వీరమాతా వియత్ ప్రసూ: " అని మర్మగర్భంగా చెబుతున్నారు. "నిన్ను నువ్వే కట్టేసుకుంటున్నావు. నా ప్రమేయం ఏమీ లేదు. ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకో . నిన్ను నేనెలా పుట్టించాను?

కేరింతలు కొడుతూ, చక్కగా కాళ్ళు చేతులు ఆడిస్తూ,

ఎంతటి చిన్న చోటయినా విశాలంగా భావిస్తూ,

చిన్నదానికి ఆనంద పడిపోతూ,

ఏ ఒక్కరి మీద ద్వేషం పెంచుకోకుండా,

నాది ,నేను, మనది అన్న భేదాలు లేకుండా,

ఎవరెత్తుకుంటే వాళ్ళ దగ్గరికి వెళ్లి, ఆనందంగా పెరుగుతూ వచ్చావు కదా!

ఇంత స్వచ్ఛంగా నిర్మలంగా పుట్టిన నువ్వు, నీ చేతుల్తోనే నిన్ను నీవు బందీ చేసుకొని నన్ను రక్షింపవా! అంటే నేనేమి చెయ్యను?

నా కాళ్ళు పట్టుకో. నన్ను తల్చుకొని ప్రతి పని చేయి." అంటూంది అమ్మ

అనగా, ఇక్కడ అర్థం చేసుకోవలసినదేమిటంటే, దుఃఖమొచ్చినా నువ్వే కారణం సుఖమొచ్చినా నువ్వే కారణం. సుఖదుఃఖలకి అతీతంగా ఉండాలి. ఒక విషయం చెప్తాను .నాకు ఈరోజు సంపద ఉంది. సంపద వలన నాకు చాలా పనులు ఉన్నాయి అని అమ్మని మరిచి పోకూడదు. అంటే ఒక గంట పూజ చేశా కదా నా బాధ్యత అయిపోయింది అనుకుంటే కాదు అందుకే ఆవిడ "హంస హంసాయ విద్మహే పరమ హంసా య ధీమహి తన్నో హంస ప్రచోదయాత్". అని చెప్పింది అంటే "నేను నిన్ను మాయలో పడకుండా కాపాడతాను కానీ నన్ను నువ్వు ఊపిరిలో చూసినపుడు మాత్రమే నువ్వు మాయలో పడకుండా కాపాడుతాను". అంటే ఒక గంట పూజ చేసేసి మిగతా అంత నా పని అయిపోయింది అని వేరే విషయాల్లో కొట్టుకు పోతుంటే నిన్ను కాపాడుతుందా? మాయ అన్నది చాలా బలమైనది ,అందుకని ప్రతిక్షణం ఏ పనిలో ఉన్నా సరే అమ్మ దయ లో ఉండాలి. అందుకే ఎవరన్నా ఎలా ఉన్నారు ? అంటే "అమ్మ దయ వాళ్ళ బ్రహ్మాండంగా ఉన్నాను" అంటాను. అమ్మ- బ్రహ్మ రెండు మంచి పదాలు పలికేసాము అలాగా జీవితాన్ని ఒక పూజ గా మార్చుకొని ప్రపంచాన్ని ఒక దేవాలయంగా మార్చుకొని నడిచే వ్యక్తులనూ , చూసే వ్యక్తులనూ దేవతలుగా భావించి చేసే పనులన్నీ కూడా ఆధ్యాత్మిక కార్యక్రమమే . అంటే ఆత్మ సంబంధమయిన కార్యక్రమం....... చేసే పనులన్నీ కూడా ఆత్మ సంబంధం పెట్టుకుని బంధువులందరు కూడా ఆత్మ బంధువులు అయినపుడు మనం మణిద్వీపానికి దగ్గర అవుతాము. కీర్తనలు పాడుకుంటే ఆనందం వస్తుంది కాని జ్ఞానం రావాలంటే కీర్తనల వెనకాల ఉన్నటువంటి తత్వాన్ని అర్థం చేసుకొని ఆకళింపు చేసుకోవాలి .

అలాగే మీకు రామాయణం చూసినా కూడా ఇదేరకమయిన తత్వం మనకి బోధ పడుతుంది.

సీత ఎక్కడుంది? లంకలో. ఎవరి చేత బంధింప బడి ఉంది? రావణుడి చేతిలో. సీత అంటే మన ఎరుక. అది బంధింపబడింది రావణుడి చేతిలో . రావణుడు ఎవరు? కోరికలకి ప్రతీక.

అందుచేత మన ఎరుక ఏదో ఒక కారణం చేత కోరికలకి బంధింప పడ్డప్పుడు ఎవరు దాన్ని కనుక్కున్నారు? హనుమంతుడు! "హనుమా" అంటే భక్తి కి నిదర్శనం ,భక్తి కి ప్రతీక . హనుమంతుడిని "రుద్రవీర సముద్భవాయ" అంటారు . రుద్రుడి అంశ నుండి పుట్టిన వాడు అంటే ద్రష్ట. కేవలం ద్రష్ట స్వభావం తో ఉంటూ ప్రతిదీ నేను చేస్తున్నాను! నేను చేస్తున్నాను! అన్న కర్తృత్వ భావం వహించకుండా పనులు చేస్తూ భక్తి తో ఎప్పుడు కూడా ఏది జరిగినా కూడా అమ్మా నీ దయతోనే నేను ఇలా ఉన్నాను అని అమ్మతో అనుసంధానం చేయాలి.

అమ్మతో ఆత్మ సంబంధాన్ని కోల్పోకుండా ఉన్న తత్వమే హనుమంతుడు. హనుమంతుడు సముద్రాన్ని దాటాడు. కానీ దానికి ముందు తన శక్తి తనకి తెలియలేదు. అలాగే మన శక్తి మనకి తెలియదు. ఎవరో వచ్చి తట్టి లేపాలి. మాములుగా ఉన్నపుడు "ఒరేయ్ లేచి గబా గబా నడవరా ఎందుకు మెల్లగా నడుస్తావు?" అంటే "ఓపిక లేదండి కాళ్ళలో శక్తి లేదు" అంటారు. అదే , ఒక పులి కానీ పాము కానీ వచ్చిందనుకోండి , పరుగు పందెం లో పరిగెత్తినట్టు పరిగెడతారు. ఆ బొమ్మ గారికి బహుమతి కూడా వచ్చేస్తుంది. ఎక్కడనుండి వచ్చిందండి ఆ శక్తి నీకు? భయం ,ఆపద వచ్చినపుడు పరిగెడతావు.

అలాగే "రోజూ పూజ చెయ్యండర్రా." అంటే "మాకు సమయం లేదండి" అంటారు. ఈ వ్యాపారమో, ఉద్యోగమో పోయినపుడు గంటల తరబడి పూజలు , హోమాలు చేస్తూ గుళ్ళలోనే కనిపిస్తూ ఉంటారు . గమనించారా ఈ విచిత్రం? సినిమాలో " లేచి వస్తావా? నన్ను లేపమంటావా? "అని పాట ఉంది .

అది... పాట అవ్వొచ్చు. అందులో కూడా అమ్మనే చూస్తా నేను. తత్వం తీసుకున్నప్పుడు "లేచి వస్తావా నన్ను లేపమంటావా? ఇప్పుడు నువ్వు మేలుకుంటావా నన్ను లేపమంటావా?" అమ్మ వచ్చి లేపితే "ఒరేయ్ లేరా" అంటుంది. లేవక పోతే నీళ్లు తెచ్చి గుమ్మరిస్తుంది తట్టుకోగలగటం కష్టం కనుక జాగరూకతతో ఉండాలి అంటుంది అమ్మ. అంత కన్నా ఏమి లేదు.

అమ్మే "లలిత సహస్రనామం దీక్ష లేకుండా చదవకూడదు" అని మనలని మాయలో పడవేయడానికి పక్కవాళ్ళ చేత అనిపిస్తుంది . మనల్ని మంచి వాటి వైపు వెళ్లకుండా చేసేదే మాయ. ఇవన్నీ ఎవరన్నా చెప్తే నిముషంలో పాటించేస్తాం. అదే ఎవర్ని తిట్టకూడదు, ఎవర్ని మోసం చెయ్యకూడదు, కోపం తప్పు అని ప్రవచనాలలో చెప్పినా పాటించడం చాలా కష్టం.

పునరపి జననం పునరపి మరణం! అందుచేత మనమందరం కూడా అమ్మవారిని "నాలోని మద మాత్సర్యాలనే తెర తీయగరాదా?" అనే పాటలో లాగా "అమ్మా ! నా ఎరుక తెర వెనుక బందీ అయిపోయింది .ఈ తెర ముందున్న ప్రాపంచిక విషయాలనే బాధ్యతల తోటి నేను నన్ను బందీ చేసుకొని.... నాకేంటి అని అడిగే బదులు నేనేంటి అని నన్ను నేను తెలుసుకునే స్థితికి నన్ను తీసుకురమ్మని" అమ్మని వేడుకోవాలి . ఎప్పుడయితే అమ్మ కరుణ మన మీద పడిందో ఈ బంధాలు అనే సంకెళ్లు కృష్ణుడు పుట్టినపుడు ఎలా తెగిపోయాయో అలా, ఈ సంసారం లో ఉంటూనే ముక్తి చెందుతాం . ఏదీ బాధించదు. అది ఎప్పుడు ? నిరంతరం అమ్మ జపం చేస్తున్నపుడు. జపం అంటే మంత్రం కాదు. ఎంత ఎక్కువ అమ్మ మీద ధ్యాస ఉంచగలిగితే అంత ఎక్కువ సుఖవంతంగా ఆనందమయంగా ఉండే స్థితికి చేరుతాం .

**కర్తవ్యం ఏమిటంటే మనమే సృష్టించుకున్న బంధాల నుండి విముక్తి చెందడం.**

**శ్రీ మాత్రే నమః**









విశ్వావసు నామ సంవత్సరా

# ఉగాది







# ఉగాది వైభవం

శ్రీ మాత్రే నమః

మార్చి నెల 30వ తారీఖు నాడు సంవత్సరాది పండుగ జరుపుకుంటున్నాం. దీన్నే ఉగాది, యుగాది అని కూడా అంటారు. భగవత్ స్వరూపం ఆది మధ్యాంత రహితం. మొదలు లేదు, అంతం లేదు, మధ్యము లేదు. కానీ జీవులమైన మనకి ఆది ఉంది, అంతం ఉంది. జననము ఆది అయితే మరణం అంతం. ఈ మధ్యలో చేసేటువంటి కర్మల్ని లెక్క కట్టడానికి అంతటా వ్యాపించినటువంటి ఆ బ్రహ్మ గారు మనకు కనబడరు. అంచేత ఏమి చేస్తున్నామో, ఎటు వెళ్తున్నామో దారి తెలియనటువంటి మనకి ఈ ఉగాది ఒక కొత్త అవకాశం.

ప్రతి సంవత్సరము ఈ ఉగాది రోజుని మనం చేసినటువంటి కర్మలని బేరీజు వేసుకోవడానికి అద్భుతమైన అవకాశం కింద మనం తీసుకోవాలి. పురాణ పరంగా చెప్పుకోవాలంటే బ్రహ్మ గారు ఈరోజే సృష్టి చేయడం ప్రారంభించారు అని చెప్పుకోవచ్చు. అది ఒక రకంగా కరెక్టే. ఎందుకంటే మనకన్నా మొట్టమొదట పుట్టినటువంటి జీవులు ఈరోజే ఉద్భవించారు. అది వాళ్ళకి ఆది. అలాగే శ్రీకృష్ణుడు ఈ ఉగాది రోజు ముందు రోజు నిర్యాణం మొదలెట్టి ఉగాది రోజుకి అంతమైపోయింది. అవతారం అని కూడా ఇది పురాణ పరంగా చెప్పుకుంటారు.

ఇంకా ఎన్నెనా నిర్వచనాలు ఇచ్చుకోవచ్చు. కాకపోతే ఉగాది పండుగలో విశిష్టత ఏమిటి అంటే ఎప్పుడూ కూడా ఒక మైల్ స్టోన్ అంటారు. చూడండి, ఇన్‌కమ్ టాక్స్ వాళ్ళు ఏప్రిల్ ఒక మైల్ స్టోన్ పెట్టుకుంటారు. అలాగే బిజినెస్‌లో ఉన్నవాళ్ళు కొంతమంది దీపావళికి అకౌంటింగ్ చూసుకుని బుక్కులు క్లోజ్ చేసి కొత్త బుక్స్ ఓపెన్ చేస్తూ ఉంటారు. మనకి జీవితం అనేటువంటి వ్యాపారంలో మనం చేసేటువంటి కర్మలు ప్రతి ఏడాది ఉగాదికి ముందు రోజు క్లోజ్ చేసేసుకుంటాం. బ్యాలెన్స్ షీట్ వేసుకోవాలి. అందువల్ల ఉగాది నాడు సూర్యోదయానికి ముందరే నిద్ర లేవాలి. అసలు రోజూ సూర్యోదయానికి ముందరే నిద్ర లేవాలి అనుకుని కనీసం ఉగాది నాడు అయినా సరే సూర్యోదయానికి ముందరే నిద్ర లేవాలి. ఎందుకంటే కొత్త సంవత్సరం. అంచేత ఈ సంవత్సర మొదలుకు ముందే మనం నిద్ర లేచి స్నాన సంధ్య అనుష్టానాలను నెరవేర్చుకుని కాసేపు ధ్యానంలో ఈ సంవత్సరం మనం చేసినటువంటి కర్మలన్నిటిని నెమరేసుకుంటే చాలా మంచిది. దీన్ని ఆత్మ అవలోకనము అంటారు.

ఆత్మ అవలోకనం చేసుకుంటే ఇప్పుడు బిజినెస్‌లో చూడండి. నష్టం వచ్చింది అనుకోండి, ఓకే, ఈ డిపార్ట్మెంట్‌లో నష్టం వస్తుంది. ఈ తప్పులు చేశారు అని నిర్ణయించేసి బ్యాలెన్స్ షీట్ సరిచేసి నెక్స్ట్ టైం ఆ తప్పు చేయకూడదు అని బిజినెస్‌లో నిర్ణయిస్తారు. జీవితం అనే ఈ వ్యాపారంలో ఎప్పుడూ లాభము అంటే శాంతి పొందాలి అనుకుంటే ఈరోజు మనం బ్యాలెన్స్ షీట్ క్లోజ్ చేయాలి. చేసి ఆ సంవత్సరంలో అంతకు ముందు చేసినటువంటి కర్మలు, తప్పులు – తప్పులు అంటే ఏమిటి?

మనం పుట్టినప్పుడు మన తల్లిదండ్రులు కొన్ని జీవిత సూత్రాలు నేర్పుతారు. వాటిని



అతిక్రమించి మనం నడుచుకుంటే అది తప్పు కిందే లెక్క. ఎందుకంటే జీవితం చూసిన వాళ్ళు, వారు చెప్పినది అనుభవపూర్వకంగా చెప్పినవి. మనం పాటించకపోతే తప్పే కదా? తర్వాత గురువు వస్తారు. ఆ గురువు కొన్ని సూత్రాలు చెప్తారు. ఇలాగ తల్లి, తండ్రి, గురువు, పురాణాలు, ఉపనిషత్తులు, గ్రంథాలు వీటిల్లో నేర్చుకున్నటువంటి సూత్రాలను ఋషులు ఏర్పరిచినటువంటి జీవన నియమాలను మనం పాటించకుండా అతిక్రమించామా అని ఒక్కసారి ఆలోచించాలి.

చిన్నవే అబద్ధం ఆడకూడదు, కోపం తెచ్చుకోకూడదు, ఎక్కువగా ప్రతి దానికి రియాక్ట్ అవ్వకూడదు. పని మన కోసమే. చెప్పినటువంటి ఆ సూత్రాలు నేను ఎన్ని సార్లు అతిక్రమించాను? ప్రతి రోజు చేసుకోవాలి ప్రమాణాలు. కనీసం ఉగాది నాడు కొత్త ప్రమాణాలు చేసుకోవాలి. ఎందుకంటే జరిగింది ఏదో జరిగిపోయింది.

డిసెంబర్ 31 చూడండి. 12 గంటల వరకు వాళ్ళకి 12తోటి అయిపోతుంది. 12 గంటలకు వేచి ఉంచి 12 అవ్వగానే ఓహో, కేకలెడుతూ "హ్యాపీ న్యూ ఇయర్, హ్యాపీ న్యూ ఇయర్" అంటారు. ఆ సంవత్సరంలో ఏ సునామి వచ్చినా, ఏ కరోనా వచ్చినా, వాళ్ళు పట్టించుకోరు. "అది అయితే అయిపోయిందయ్యా, ఇక మీదట మనం శాంతిగా ఉందాం" ఆశ మని మనిషి ఆశాజీవి. అలాగే ఉగాది నాడు కూడా వచ్చే సంవత్సరం రాబోయే సంవత్సరం నాకు సంతోషంగా ఉండు గాక!



ఆ సంతోషంగా ఉండాలి అంటే కేవలం భగవంతుడి మీదే భారం వేసి, గ్రహాల మీదే భారం వేసి, నా పని ఏమీ లేదు అని బాధ్యత రహితంగా ఉండకుండా ఈ ఉగాది రోజుని నేను చేసినటువంటి ఈ తప్పులు, ఈ ఉగాది రోజు నేను ఈ సంవత్సరంలో చేయను అని ప్రమాణం చేయాలి. ఈ సంవత్సరం అంతా నేను సంతోషంగా ఉంటాను. పరిస్థితి ఎలా ఉన్నా సరే.

ఇది కష్టమే కానీ ఒక లక్ష్యం పెట్టుకుంటే మంచిదే కదండీ. ఈ సంవత్సరం అంతా కనీసం ఎవరి మీద కోపగించుకోను. ఈ సంవత్సరం అంతా నేను ఎవరికైనా ఒకళ్ళకైనా రోజు సహాయం చేస్తాను. ఈ సంవత్సరం అంతా నేను తృప్తిగా ఉంటాను. ఇలాగ కొన్ని మనకంటూ ఏర్పడి మను ధర్మం ఒకటి. నా ధర్మం స్వధర్మం. అందుకే "బాగుగా ఆచరించిన స్వధర్మము, పరధర్మము కన్నా గొప్పది" అని గీతలో చెప్తారు.

అందుచేత నాకు నేను ఏర్పరచుకున్న నియమం అంటే నాకు కొంచెం గౌరవం ఉంటుంది. ఎవడో చేసిందని కాదు, నేను పాటించాలి. ఇది నా ధర్మం అని పాటించబోతే ఎలా? కానీ కొంచెం బాధ్యత ఉండాలి. అందుచేత నేను నియమాలు ఏర్పరచుకోవాలి. ఏర్పరచుకున్న నియమాలు తూచా తప్పకుండా పాటించడానికి చూడాలి.

అందుకు భగవంతుని యొక్క అదృశ్య శక్తి యొక్క తోడ్పాటు ఎంతైనా అవసరం. ఇంకొకటి ఏమిటంటే, స్ప్రింగ్ క్లీనింగ్ అని పాశ్చాత్య దేశాల్లో చేస్తారు. అంటే వసంత కాలంలో వాళ్ళు ఇల్లు శుభ్రం చేసుకుంటారు. అంటే పనికిరాని చెత్త సరుకు అంతా తీసేసి పడేయడం.

స్ప్రింగ్ క్లీనింగ్ అంటే వసంత కాలంలో పనికిరాని చెత్త సరుకు అంతా తీసేసి పడేయడం. ఒకవేళ ఉపయోగించకపోతే ఆరు నెలలు కూడా ఉపయోగించకపోతే ఆ వస్తువు నాది కాదు అని చెప్పి, దానిని దానం చేసేయడం. ఇది పాశ్చాత్య దేశాల్లోని పద్ధతి. అలాగే మన మనసులో ఉన్న చెత్త ఆలోచనలను కూడా తగలబెట్టి స్వచ్ఛమైన జీవనాన్ని స్వీకరించడమే అసలు ఉద్దేశం. ఈ దేహం, మనస్సు, ఆత్మ — వీటిని కలుషితం చేసేవాటిని వదిలేయడం. మనం ఎన్నో రకాల భయాలు,

కోపాలు, అనవసరమైన అహంకారాలు పోషిస్తూ ఉంటాం. ఇవన్నీ ఒక భారం లాంటివి. ఈ భారం లేకపోతే మనం ఎంత హాయిగా జీవించగలం?

ఉగాది పచ్చడి తినడమే కాదు, దాని అర్థం తెలుసుకోవాలి. ఆరు రుచులు కలిపి ఉండటానికి ఎంతో అర్థవంతమైన దార్శనికత ఉంది. తీపి అంటే సంతోషం, చేదు అంటే దుఃఖం, ఉప్పు అంటే అవసరమైన అనుభవాలు, పులుపు అంటే మార్పులు, కారం అంటే సవాళ్లు, వేపపువ్వు అంటే జీవన సత్యం. మన జీవితం కూడా ఇలాగే అన్ని రుచుల సమ్మేళనం. ఒక్క తీపి మాత్రమే ఉంటే అది అసలు జీవితం కాదు. అదే విధంగా, ఒక్క చేదు మాత్రమే ఉన్నా అది భగవంతుని కల్పిత సృష్టి కాదు.

అందుకే మనం ఉగాది రోజున ఈ ఉగాది పచ్చడి తింటూ జీవితంలోని అన్నిరకాల అనుభవాలను సమానంగా స్వీకరించాలని నేర్చుకోవాలి. కష్టాలంటే భయపడకూడదు. సుఖాలంటే మిగతా వాటిని మర్చిపోకూడదు. ఆనందంగా ఉండటానికి ముఖ్యమైన విషయం మనం మనసును ఎలా ఉంచుకుంటామన్నదే. మనం ఎప్పుడైనా చెడుగా భావించిన వాటిని స్వీకరించక, వాటిని దాటుకుని పోగలిగితే అది నిజమైన పరిణితి.

ఉగాది రోజు మనం కొత్త బట్టలు కూడా ధరిస్తాం. కొత్త బట్టలు అంటే కేవలం కొత్త దుస్తులే కాదు, మనలో కొత్త ఆలోచనలు కూడా రావాలి. పాత అలవాట్లను వదిలి, కొత్త మంచివాటిని అలవర్చుకోవాలి. మనం గతంలో చేసుకున్న తప్పులను గుర్తు పెట్టుకుని, వాటిని ఇకపై చేయకూడదని నిర్ణయించుకోవాలి.



ఇంకా ముఖ్యమైన విషయం, ఉగాది నాడు పంచాంగ శ్రవణం. పంచాంగ శ్రవణం అంటే భవిష్యత్తులో మనకు ఏమి ఎదురవుతుందనే జ్యోతిష్య సూచన మాత్రమే కాదు. అది ఒక భౌతిక సూచిక. భవిష్యత్తులో మనం ఎలా ఉండాలో దానికి ఒక మార్గదర్శనం. గ్రహణాలు ఎప్పుడు వస్తాయో తెలుసుకుని, ఆ సమయాన్ని జపానికి వినియోగించుకోవాలి. ఏ రాశికి ఏ ఫలితాలు వస్తాయో విని, మనం ఎలాంటి పరిహారాలు చేపట్టాలో నిర్ణయించుకోవాలి.

పంచాంగ శ్రవణం తరువాత మనం కొన్ని ప్రమాణాలు చేసుకోవాలి. ఇవి సాధారణ ప్రమాణాలు కావు, మన జీవితాన్ని మలుపుతిప్పే మహత్తరమైన నిర్ణయాలు.

మితాహారం — మనం తినే ఆహారాన్ని పరిమితం చేసుకోవాలి. మన శరీరానికి అవసరమైనంత తినాలి. అనవసరంగా తిని శరీరానికి భారంగా మారకూడదు. మితాహారం వల్ల మన శరీరం ఆరోగ్యంగా ఉండటమే కాదు, మనస్సు కూడా చైతన్యవంతంగా ఉంటుంది.

ప్రియ ఆహార వర్జితం — మనకు ఎక్కువ ఇష్టమైన ఆహారాన్ని వదిలేయడం. ఇది మనలో ఉండే వ్యామోహాన్ని తగ్గిస్తుంది. మనం ఎప్పుడైనా ఇష్టమైనదాన్ని తప్పకుండా తినాలనే బలమైన భావనలో ఉంటే, అది కూడా ఒక బంధమే. ఈ బంధాన్ని తగ్గించుకోవడానికి, మనకు ఇష్టమైన పదార్థాన్ని వదిలి పెట్టడమంటే మన చిత్తశుద్ధికి దోహదపడుతుంది.

మిత భాషణం — మనం మాట్లాడే మాటలను పరిమితం చేసుకోవాలి. అనవసరంగా మాట్లాడకుండా, అవసరమైనప్పుడు మాత్రమే మాట్లాడాలి. మాటల వల్ల చాలా శక్తి వృథా అవుతుంది. ఒక మనిషి తక్కువ మాటలు మాట్లాడితే, అతని శక్తి అంతా అతనికి అవసరమైనదానికే ఉపయోగపడుతుంది.

భూశయనం — మన అహంకారాన్ని తగ్గించుకోవడం. నేల మీద పడుకోవడం కాదు, నేలపై దృఢంగా ఉండే విధంగా మన మనస్సును అలవర్చుకోవడం. ఎప్పుడూ ఈ ప్రపంచంలో ఎవరో ఒకరు మనకంటే గొప్పవారు ఉన్నారని తెలుసుకుని, నిత్య వినయం, సాధారణ జీవనశైలి అలవర్చుకోవడం.

ఈ నాలుగు ప్రమాణాలు మనం ఉగాది నాడు మన మనస్సులో గాఢంగా నాటుకోవాలి. ఇవి పాటించగలిగితే మన జీవితం సంపూర్ణంగా మారిపోతుంది.

ఉగాది రోజు మనం చేసే మళ్లీ ముఖ్యమైన పని — ధ్యానం. ధ్యానం అంటే కేవలం కళ్ళు మూసుకుని కూర్చోవడం కాదు, మనలో ఏం జరుగుతోంది అనే స్పష్టత తెచ్చుకోవడం. మన ఆలోచనలపై నిఘా ఉంచుకోవడం. ధ్యానంతో మన మనస్సు ప్రశాంతంగా మారుతుంది. మనలో చైతన్యం పెరుగుతుంది. మనం చేసే ప్రతి పనిని మనం ఎలా చేయాలో అర్థం చేసుకోవడానికి ధ్యానం ఎంతగానో సహాయపడుతుంది.

ఉగాది అనేది కొత్త సంవత్సరంలో ప్రవేశించే ఒక సందర్భం మాత్రమే కాదు, మన జీవితంలో కొత్త మార్గాన్ని ఎంచుకునే గొప్ప అవకాశం. మనం నిత్యం ఆనందంగా ఉండాలని కోరుకుంటే, మన ఆలోచనలను కూడా అలాగే మార్చుకోవాలి. ఆనందాన్ని మనం ఎక్కడో వెతుక్కోకూడదు, మనలోనే అందాన్ని చూడాలి.

ఈ ఉగాది మన అందరికీ ఆనందాన్ని,

ఆయురారోగ్యాన్ని, ఐశ్వర్యాన్ని కలిగించాలని ఆకాంక్షిస్తూ...

శ్రీ మాత్రే నమః





ప్రత్యేక వ్యాసం





# గోమాత

రచన:
శ్రీమతి జయశ్రీ పసల

శ్రీ గురుభ్యోనమః     శ్రీ మాత్రేనమః

భారతీయ నాగరికత లో గొప్ప ధార్మిక మహిమ కలది ఆవు. భారతీయ సంస్కృతి జీవన విధానానికి ఆవు ప్రతిబింబం.

శ్లో : గా వో మే మాతరస్సర్వా , గా వో మే పితరస్సదా,

గా వో మమాగ్రతస్సంతు, గా వో మే సంతుప్రష్టతః

గా వో మే పార్శ్వ తస్సంతు గవాంబృందేవ

సామ్యహం :

ఒకానొక కల్పకాలంలో భారతదేశం కరువు కాటకాలతో అల్లాడి పోతుంటే దేవతలు, ఋషుల కోరిక మేరకు 'సురభి ' ని భూమి పైకి కానుకగా పంపారని, ఆ సురభి సంతతే ఈ గోవులని మనకి పురాణాలూ చెబుతున్నాయి. గోవు సాక్షాత్ లక్ష్మి, విష్ణువు స్వరూపంగా మన గ్రంథాలు అభివర్ణిస్తున్నాయి.

ఆవు అమ్మలాంటిది. తల్లి పాలను సేవించిన బిడ్డ జీవితాంతం ఎలాగైతే రోగ నిరోధక శక్తి ని కలిగి ఉంటుందో అదే విధం గా ఆవు ఇచ్చే ఉత్పతుల ద్వారా, వ్యక్తికి, ప్రపంచానికి, అనేక ప్రయోజనాలు ఉన్నాయి.ఆవు ఇచ్చే సహజమైన వనరుల్లో, కాన్సర్, ఎయిడ్స్, వంటి వ్యాధుల్ని నయం చేసే గుణముంది అని శాస్త్రవేత్తలే చెబుతున్నారు.

మన పురాణాలూ, గోవు నందు సర్వదేవతలు సర్వ లోకములు ఉన్నవని ధేనుమహత్యము మున్నగు స్తుతులు ద్వారా వెల్లడించుచున్నవి, సరస్వతి బ్రహ్మలు, లక్ష్మీ నారాయణులు, పార్వతి పరమేశ్వరులు మిగిలిన దేవతలు, రుద్రులు, మున్నగు సర్వ దేవతలు, సనకసనందనాది విశిష్ఠ జ్ఞానులు గో స్వరూపమున నిమిడి ఉన్నట్లు గా మన పురాణాలూ చెప్పుచున్నవి. గోవును ప్రత్యక్ష దైవం గా సర్వ దేవతలు, స్వరూపంగా, సర్వజన సమారాధ్యనుగా చిత్రించినవి. అష్ట మంగళకర ద్రవ్యములలో గోవు ఒకటి.

గీత, గంగ, గురువు, గోవిందుడు, గాయత్రి, గోవు అను గకారషడ్ వర్గము ప్రాణులనుద్ధరించునని పెద్దలు చెప్పు చున్నారు. మనము "గో బ్రాహ్మణభ్యః శుభమస్తూ నిత్యం" అను పెద్దల వాక్యమును స్వస్తి వాక్యముగా పలుకుచున్నాము.

పార్వతీ మాత కైలాసమున పరమశివుని భక్తితో పూజించి తెలియక చేసే పాపములు నుండి విముక్తి కలిగించే మార్గమేదైనా ఉంటే చెప్పమని కోరగా దయార్ద హృదయుడైన పరమశివుడు గోవుల యందు సమస్త దేవతలు ఉన్నారని, అట్టి గోవులను పూజిస్తే సమస్త పాపములు నుండి విముక్తి కలుగుతుంది అని అన్నారట.

భారతీయులు గోవుని భక్తితో పూజిస్తారు. శుభాన్ని ఆశి స్తూ గోమాత వ్రతాన్ని మహిళలు సోమవారం రోజున శక్తిశ్రద్ధలతో ఆచరిస్తూంటారు.రెండు కోరికల్ని మనసులో అనుకోని పూజను ఆరంభిస్తే ఆ రెండు కోరికల్ని గోమాత తీరు స్తుందని నమ్మకం. గోమాత పూజ కూడా చాలా ప్రశస్థ్యం ఉన్న కత్రువు, చాలాదేశాలలో గోవుని పూజచేస్తారు, నేపల్ లో దీపావళి పండుగ ముందు రోజు గోమాత పూజ చేస్తారు.

అన్ని దేశాలకన్నా భారతీయ గోవు సౌరశక్తి ని అధికంగా గ్రహిస్తుంది. గోవులో ముక్కోటి దేవతలు దాగివున్నారు. దీని మూపురం లో ఉన్న స్వర్ణనాడి గోమాత బంగారు తత్వన్ని స్తుంది. గోవు నుండి పుట్టే ప్రతి పదార్థం మానవాళి ఆరోగ్యానికి అద్భుతంగా ఉపయోగ పడుతున్నాయి.

గోమాత యందు సకల దేవతలు కలరు

1.గోవు పాదము పితృదేవతలు

2.పిక్కలు పిడుగంటలు

3.అడుగులు ఆకాశగంగలు

4.ముక్కోలు కొలుకులు ముచ్చిన చిప్పలు

5.కర్రి కర్రేనుగ

6.పాడుగు పుండరీకాక్ష

7.సన్నుకట్టు సప్తసాగరాలు

8.గోవుమయం శ్రీలక్ష్మి

9.పాలు పంచామృతాలు

10.తోక తొంబైకోటి ఋషులు

11.బొడ్డు పొన్నపువ్వు

12.కడుపు కైలాసం

13.కొమ్ములు కోటి గుళ్ళు

14.మొగము దెష్ట

15.వెన్ను యమధర్మరాజు

16.ముక్కు సిరి

17.కళ్ళు కలువరేకులు

18.చెవులు శంకనాదం

19.నాలుక నారాయణ స్వరూపం

20.దంతములు దేవతలు

21.పళ్ళు పరమేశ్వరి

22.నోరు లోకనిధి

ప్రొద్దున్నే లేచి గోవుమహత్యమును పఠించుకుంటే సకల పాపములు పోవును. ఎరిగి ఎరుగక చేసిన పాపము అంతా కూడా పరిహారము.

శ్లో : గ్రీవా మస్తక సందౌతు తాసాం గంగా ప్రతిష్టితా
సర్వదేవ మయాగావ సర్వతీర్థ మయా స్థధా ::

గోవు యొక్క కంఠం, మస్తకము మధ్య (గంగడోలు )గంగ కలదు. గోవు యొక్క సమస్త అంగములందు సమస్త దేవతలు, తీర్థములు కలవు అని మనవారు భావిస్తారు. గోక్షీరం ఔషదం లాంటిది. తల్లి పాలు లేని శిశువులకు సైతం ప్రత్యామ్నాయంగా గోమాత పాలనే వాడతారు. వైద్యం లోకూడా గోవుపాలను వాడతారు. పల్లెటూర్లలో ప్రతిరోజూ ఉదయాన్నే ఆవు పేడతో నీళ్లు చెల్లి తద్వారా

క్రిమికీట కాలనుండి రక్షణ పొందుతారు. పూజలు చేసె అప్పుడు ఆ ప్రాంతాన్ని ఆవు పెడతో శుద్ధి చేసి ప్రారంభిస్తారు.

భవిష్యోత్తర పురాణన బ్రహ్మ నారద సంవాదరూప గోమయ వ్రత వృథాంతం, గో ద్వాదశ వృథాంతం కూడా తెలుప బడ్డాయి. ఇతిహాస యుగములు నుండి నేటి వరకు గోమాత, సాక్షాత్ దేవతా స్వరూపమే . ఆవుకు సంభందించిన పాలు, పెరుగు, నెయ్యి, మూత్రం, పేడ అన్ని కూడా ఉపయుక్తమూలే. వీటినే పంచగవ్యాలు అని అంటారు. శాస్త్రీయం గా కూడా అది రుజువు అయినది.

"గోభిస్తుల్యం నాపశ్యామ ధనం కించిది హాచుత "

ఈ జగత్తులో గోసంపదతో సమానమైన ధనం చూడలేదని చవన మహర్షి చే చెప్పబడినది. కలియుగం సప్తగిరుల పై వేంకటేశ్వరస్వామి ఆవిర్భవించినప్పుడు గోక్షీరాన్ని ఆహారంగా స్వీకరించారని చెప్పిన కథ వలన గోవు యొక్క ప్రాముఖ్యత తెలుసుకొనవచ్చును.

పంచమహాపాతకాలలో గోహత్య చాలా ఘోరమైనది. గృహప్రవేశం మొదలు యజ్ఞయాగాదులు, పితృకర్మల దాకా అన్నింటిలోనూ గోవుకు ముఖ్య స్థానాన్ని ఇచ్చారు. అందువలన దేశం సౌభాగ్యము ఇనుమడిస్తుంది.

కానీ దురుదృష్టం ఏమి అనగా, గోమాత కు పూజలు చేయక పోగ,వాటిని చంపి తినే పరిస్థితి కి, వచ్చింది, మేము తినము మాకు ఆ పాపం తగలదు అని అనుకోవడం సరి కాదు ఎందుకనగా, మనం పార వేసే ప్లాస్టిక్ సంచులు అవి తిని ఎన్నో గోవులు మృత్యు వాత పడుతున్నాయి,, రోడ్లు మీద చెత్త తినే పరిస్థితులు వచ్చాయి వాటికి, కొన్ని గోవులు కాబేలా కి వెళ్తే కొన్ని చెత్త తిని గాజు పెంకులు తిని చనిపోతున్నాయి. కావున మనం వాటిని కాపాడుకోవాలి కనుక అవి ఎక్కడైనా బాధ పడుతున్న వాటిని గోశాలలకు తరలించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిది, కనీసం వాటి దాహం తీర్చుకోటానికి ఐనా మన ఇంటి ముందు చిన్నతోట్టి ఏర్పాటు చేసి ఉంటే నీరు తాగి దాహం తీర్చుకుంటాయి, నేను మా ఇంటి ముందు ఎప్పుడు, వాటికోసమే కాకా చిన్న జీవులు నీటి కోసం చిన్న తొట్టిని ఏర్పాటు చేసాము. చాలా వాటిని గోశాలలకు కూడా తరలించాము.

అది నా బాధ్యత,

మన అందరి బాధ్యత.



గోపాలన, పోషణ, రక్షణ దేశసంమృద్ధికి సూచిక

" గోరక్షో రక్షతి రక్షితః "......

శుభం.

గురువాణి

# శ్రీ దేవీ ఖడ్గమాల

(భాగము - 20)



# శ్రీ దేవీ ఖడ్గమాల

(భాగము - 20)

**లోపాముద్రామయి**

ఖడ్గమాలలో వచ్చే పేరు "లోపాముద్రామయి". ఈ పేర్లను చూస్తే ఒక శక్తి ప్రవాహం స్పష్టంగా కనిపిస్తుంది. "చర్యానాధమయి" అంటే ఏమిటో మనం ఇప్పటికే తెలుసుకున్నాం — అమ్మ మన ప్రతి చర్యలో నిండివున్నది. ఇక, కలియుగంలో ఆమె స్వయంగా మనకు కనిపించేది — మూర్తి/అమూర్తి.

"అమూర్తి" అంటే మూలప్రకృతి, ఈ విషయం గురించి మనం విన్నాం. ఇప్పుడు "మూర్తి" గురించి మాట్లాడుకుందాం. అమ్మ లోపాముద్ర రూపాన్ని ధరించి మనకు పరిపూర్ణత (పూర్తి భావన) నేర్పింది. ఆమె ఎంతో పరిపూర్ణమైనది! లోపాముద్ర ఋగ్వేద కాలం నాటిదే.

సాధువుల జీవితాలు మనకు గొప్ప స్ఫూర్తి. అగస్త్య మహర్షి, లోపాముద్ర కథ అందరికీ తెలిసిందే. సాధువుల జీవితాలు అందరికీ మార్గదర్శకంగా ఉంటాయి. అగస్త్య మహర్షి కుటుంబం త్రిశంకు స్థితిలో ఉండిపోయింది — అంటే స్వర్గానికి వెళ్లలేరు, భూమికీ రాలేరు. కారణం — అగస్త్యునికి సంతానం లేకపోవడం.

సంతానం కావాలంటే పెళ్లి చేసుకోవాలి. అందుకే అగస్త్యుడు తపస్సుతో ఒక సుందరమైన రూపాన్ని సృష్టించాడు. ఆయనకి పర్ఫెక్ట్ సంతానం కావాలి కాబట్టి, ప్రకృతిలోని వివిధ అందాలను సమ్మిళితంగా తీసుకుని పరిపూర్ణంగా ఆమెను రూపొంచాడు. ఆ పేరే "లోపాముద్ర". "లోప + అముద్ర" — అంటే ఆమె అందంలో ఎలాంటి లోపం లేదు. ఆమె అసాధారణ సౌందర్యం కలిగినదే.

పరిపూర్ణత చూడండి, ఎంత అద్భుతంగా వివరించబడింది! ఒక సాధారణ మనిషి జీవితంలో భార్య ఒక విధంగా ఉంటుంది. కానీ, ఒక సన్యాసి భార్యగా జీవించడం వేరే విధంగా ఉంటుంది — అది కత్తి అంచున నడిచే జీవితం లాంటిది. ఎన్నో త్యాగాలు చేయాల్సి ఉంటుంది.

కాబట్టి, లోపాముద్రను సృష్టించిన తర్వాత, అగస్త్యుడు ఆమెను విదర్భరాజుని వద్దకు అప్పగించాడు.

లోపాముద్ర యుక్తవయస్సుకు రాగా, ఆమె వివాహం చేసుకునే సమయం వచ్చేసింది. అప్పుడు అగస్త్య మహర్షి తిరిగి వచ్చి, రాజుకుమార్తెను వివాహం చేసుకోవాలని కోరాడు. సాధారణంగా, ఏ తండ్రైనా తన కూతురిని ఒక సన్యాసికి ఇచ్చి పెళ్లి చేయడానికి ఇష్టపడడు. కానీ లోపాముద్ర మాత్రం అగస్త్య మహర్షిని వివాహం చేసుకోవడానికి సిద్ధంగా ఉంది.

ఇక్కడ సృష్టి, సృష్టికర్త మధ్య ఉన్న అనుబంధం, భక్తుడు - భగవంతుడు మధ్య ఉండే బంధం లాంటిది. లోపాముద్ర అగస్త్యుని చేత సృష్టించబడినవాడే కాబట్టి, ఆమె అతని నుండి వేరుకాలేదు. ఆమె అతడినే వివాహం చేసుకుంది. ఆమె స్వయంగా పరిపూర్ణమైనదైనా, ఆమె పరిపూర్ణమైన భార్యగా కూడా నిలిచింది. ఆమె వేద ద్రష్ట. "ఋషి" అనే పదానికి స్త్రీలింగ పదమే "ఋషిక". లోపాముద్రలో వేద సారాంశం ఉంది.

పెళ్లయిన కొత్తలో, ఆమె పరిపూర్ణమైన భార్య. కానీ, అగస్త్య మహర్షి తన ధ్యాన, తపస్సులో ఉండి, తన భార్య పట్ల పెద్దగా శ్రద్ధ పెట్టలేదు. ఈ విషయాన్ని గురించి లోపాముద్ర ఒక్క మాట కూడా అనలేదు. అయినప్పటికీ, భర్తగా తన బాధ్యతలను గుర్తు చేసేందుకు ఒక శ్లోకాన్ని రాసింది. ఆ శ్లోకం ఋగ్వేదంలో ఉంది.

వేదాలకు సహకరించిన మైత్రేయి, గార్గి వంటి మహానుభావుల జాబితాలో లోపాముద్ర కూడా ఒకరు. ఆమె రాసిన శ్లోకాన్ని చూసిన తర్వాత, అగస్త్యుడు తన దోషాన్ని గ్రహించాడు. అప్పటి వరకు కేవలం తపస్సులో ఉన్న అగస్త్యుడు, ఒక బాధ్యతగల భర్తగా, తండ్రిగా, తన పూర్వీకులకు మోక్షం కలిగించే సంతానంగా మారాడు. లోపాముద్ర యొక్క

గొప్పతనం ఇంతటి మార్పును తీసుకువచ్చేంతటి దివ్యమైనది.

అందుకు ప్రతిఫలంగా, అగస్త్య మహర్షి హయగ్రీవ భగవానుడి నుండి "లలితా సహస్రనామం" తెలుసుకున్నాడు. (ఇది హయగ్రీవ - అగస్త్య సంవాదంలో చెప్పబడింది.) అయితే, అతను శ్రీ లలితా సహస్రనామంలోని అంతరార్థాన్ని తెలుసుకున్నాడు కానీ, దాని గ్రంథరూపాన్ని మాత్రం తెలుసుకోలేదు.

అగస్త్యుడు ప్రవేశపెట్టిన కాది విద్య, లోపాముద్ర ప్రవేశపెట్టిన హాది విద్య సామాజికంగా ఎంతో ముఖ్యమైనవి. లోపాముద్ర అనేది సృష్టికర్త మరియు సృష్టి మధ్య ఉన్న ప్రత్యేకమైన అనుబంధాన్ని సూచిస్తుంది. మనకు జ్ఞానాన్ని అందించే సృష్టికర్తను సృష్టి నుండి వేరు చేయలేము.

మనము పరిపూర్ణంగా ఉండాలంటే, పరిపూర్ణతను అర్థం చేసుకోవాలి. "పూర్ణమదః, పూర్ణమిదం, పూర్ణాత్ పూర్ణముదచ్యతే" అనే వేద మంత్రం కూడా ఇదే చెప్తుంది.

అంతేకాదు, సృష్టికర్త సృష్టితో పూర్తిగా అనుసంధానమై ఉండడు, అదే "నిర్లేపత్వం". ఇది జ్ఞానం - మాయల మధ్య సన్నివేశాన్ని తెలియజేస్తుంది. ఒక పరిపూర్ణ ఉపాసకుడు అయిన నేను, ఈ రెండింటి మధ్య తేడాను అన్వేషించనవసరం లేదు. ఎందుకంటే ఇవి రెండూ ఆమె లీలలే. ఈ అంతరార్థమే 100% పరిపూర్ణత.

కాబట్టి, లోపాముద్రమయి అనేది "శ్రీ లలితా పరమేశ్వరి" యొక్క అవతారమే. "లోపాముద్రార్చిత" అనే నామం కూడా ఉంది, అంటే ఆమె లలితాదేవిని పూజించింది. "ధ్యాన ధ్యాతృ ధ్యేయ రూపా" — అంటే, తానే ధ్యానమై, తానే ధ్యాతృ (ఉపాసకురాలు)గా, తానే ధ్యేయ (పూజించదగినది)గా మారింది.

అందుకే, శ్రీ లలితా పరమేశ్వరి స్వయంగా లోపాముద్ర రూపంలో ప్రత్యక్షమై, మనకు పరిపూర్ణత బోధించింది.

### అగస్త్యమయి

ఖడ్గమాలలో తదుపరి నామం "అగస్త్యమయి". అగస్త్య మహర్షి కథను నేరుగా అక్షరార్థంలో తీసుకోకూడదు, దీనికి లోతైన అంతరార్థం ఉంది.

అగస్త్య మహర్షి శరీరదృష్ట్యా పొట్టివాడైనప్పటికీ, అతని మహిమాన్విత గుణాలు అపారమైనవి. పురాణాల్లో చెప్పే కథ ప్రకారం, శివుడి వద్ద నుండి తత్త్వం, తంత్ర జ్ఞానాన్ని పొందేందుకు అనేక మంది ఋషులు ఉత్తరదిశకు వెళ్లారు. ఈ కారణంగా, భూమి ఉత్తర దిశగా వంగిపోయింది. అప్పుడు, ఈ సమతుల్యతను కాపాడేందుకు అగస్త్య మహర్షి దక్షిణానికి వెళ్లాడు.

